# ప్రాణదాత

రాత్రి పదిగంటల సమయం.

బయట చలిగాలి వీస్తున్నా గదిలోపల వెచ్చగా వుంది. నల్లటి నాపరాళ్లపైన, తెల్లటి గోడల మధ్య నీలిరంగు కాగితంతో ఆచ్ఛాదింపబడిన చిన్న బల్బునుంచీ ప్రవిస్తున్న కాంతిలో ఆగది చిన్న సముద్రంలా వుంది. గోడప్రక్కగా నవారు మంచం. మంచంపైన మల్లెపువ్వులాంటి దూది పరుపు. చెదిరిన ముంగురులతో, బరువెక్కుతున్న కనురెప్పలతో, ఆలోచనల గొలుసుకట్టు వెంట సాగిపోతూ నిద్రాదేవత ఒడిలోకి జారుకుంటోంది నీరజ.

పచ్చి పసుపుకొమ్మును చిదిమి చేసిన బొమ్మలా వుంటుంది నీరజ. అంతకంటే కాడతో సహా కోసితెచ్చిన తామరపువ్వులా వుందనడం సమంజసం. ఎందుకంటే నీరజ ముఖంలో అలత కాస్తా స్పష్టంగానే కనిపిస్తోంది.

ఉదయం ఎనిమిది నుంచీ సూర్యాస్తమానం వరకూ ఉద్యోగ కార్యభారంలో నీరజ అలసిపోయిన మాట వాస్తవం. ఐతేనేం, ఆ బడలిక గూడ నీరజ సౌందర్యానికి ఉద్దీపకంగానే వుంది. విడ్డూర మేముంది? అందమగుచోట సర్వమూ అందమే నని కవికులగురువులు చెప్పనే చెప్పారు మరి!

నీరజ ఉద్యోగంలో చేరి యింకా రెండు మాసాలు నిండలేదు. అలసిపోయి యింటికి వచ్చిన అమ్మాయికి భోజనం పెడుతూ ముసలావిడ "అదేమిటో గానీ నా కళ్ళకు నువ్వు చిక్కిపోతున్నట్లు కనిపిస్తున్నావే నీరజా! అవునులే, 'డూటీ అంటే మాటలా!' అంటుంటుంది.

నీరజ ఆశ్చర్యపడుతుంది. కల నిజమైతే ఎవరికైనా ఆశ్చర్యమే కలుగుతుంది. అందులోనూ పగటికల! పదేళ్ళపాడుగునా ఆ పగటి కలలోనే బ్రతికింది నీరజ. ఎప్పటికప్పుడే ఆ కల చెదిరిపోవచ్చు ననుకునేది. అమృతం దేవతలకోసం! రాహువులాంటి తాను అందుకోసం ఆశించడం వట్టి అడియాస అనుకునేది. ఆలోచిస్తూ నిద్రపోయి, నిద్రలో కలగని, కలలో తన పగటికల చెదిరిపోయినట్టు భావించి, స్వర్గంనుంచీ తను

అధోలోకాలకు కృంగిపోతున్నట్టు భ్రమించి గుండెల్లో గడ గడలాడిపోయేది. కానీ ఆశించిన అమృత పాత్ర ఆకాశకుసమం కాలేదు నీరజకు! ఎందుకు కాలేదు? అందుకు కారణం తాతయ్య ఆత్మబలమా! తన పూర్వజన్మల సుకృతమా! కాక భగవంతుడి కృపాకటాక్షమా! కారణం ఏమిటో నీరజకు తెలియదు. ఏవో అదృశ్య హస్తాలు తనకు అభయమిచ్చాయి. అండగా వుండి తనను సురక్షితంగా గమ్యస్థానానికి చేర్చాయి. తాతయ్య చనిపోయిన కొత్తలో తనకింక దిక్కెవ్వరని రోదించింది నీరజ. క్రమక్రమంగా దిక్కులేని వారికి దేవుడే దిక్కన్న గుండెనిబ్బరంలోకి రాగలిగింది.

ఈ చివరిమాట తనవిషయంలో ఋజువైనట్టు మరెక్కడా కాలేదనీ, కాబోదనీ నీరజకు ఓ బలీయమైన విశ్వాసంగూడా వుంది!

ప్రక్క ఇంటి గోడగడియారం ఒక్కసారి మ్రోగింది. గంట పదిన్నర కావస్తోందన్న మాట! సినిమాల నుంచీ ఇళ్లకు తిరిగివెళ్తున్న వారి మాటల కలకలం నీరజకు లీలగా వినవస్తోంది. ఆ సవ్వడిని చీల్చుకుని దూరంగా ఎక్కడో పెళ్లి జరుగుతున్న చోటునుంచీ రికార్డుల సంగీతం సన్న సన్నగా వినిపిస్తోంది. పాతపాట. ఐనా ఆ పాట మధురంగా వుంది. పాటలో ఓ జవరాలు 'ఎవరినే, నే నెవరినే' అంటూ తనను తానే ప్రశ్నించుకుంటోంది. వయస్సు చెడ్డది! అది నువ్వు ఫలానా దానివని తెలియజెప్పగల వారికోసం అన్వేషిస్తుంది. ఆ అన్వేషణలో యిలాటిప్రశ్న ఉద్భవిస్తుంది. గాబోలు! ఈ సరికొత్త వూహ నీరజ మనో వీధిలో వేకువజామున పూలతోటపై నుంచీ వీచిన కమ్మతెమ్మెరలా పారాడింది. మెలకువకూ నిద్రకూ మధ్య మైకంలాంటి ఆ మానసికావస్థలో గూడా నీరజ సిగ్గు పడిపోయింది. సిగ్గులో నుంచీ నిగ్గులు సంతరించుకుని అధరాలపైకి ప్రాకివచ్చిన చిన్న దరహాసంతో ఆమె ముఖమండలం అరుణరాగ రంజితమైపోయింది.

అబ్బే, యిదేమీ బాగుండడం లేదని అనుకోదలచింది నీరజ. కానీ అనుకోలేక పోయింది. వెండిగిన్నెలో పోసి తెచ్చిన పాయసంలా, పెదవి కందించిన పాలకోవాలా అంత మధురంగా వున్న వూహలను బాగుండలేదని నీరజ ఎలా అనుకోగలుగుతుంది?

ఒకటి.....రెండు.....మూడు

తలుపును బాదిన శబ్దం వరుసగా మూడుసార్లు వినిపించేసరికి త్రుళ్ళిపడి నీరజ కళ్ళు తెరిచింది. "ఎవరు? ఏంకావాలి?" ముసలావిడ ప్రశ్నిస్తోంది.

"డాక్టరమ్మగారున్నదీ యింట్లోనే గదండీ! పనిబడింది. ఓ కుర్రాడి పరిస్థితి అపాయకరంగా వుంది...." కంపిస్తున్న కంఠంతో ఓ వృద్ధుడు బదులు చెబుతున్నాడు.

"ఇక్కడ డాక్టరమ్మగారు స్వంతంగా 'ప్రాక్టీసు' చెయ్యటం లేదు. పైగా నిద్ర పోతున్నట్టుంది గూడా. వెళ్ళి మరెవరినైనా చూచుకోండి..."

"అయ్యో, అలా అనకండమ్మగారూ! దగ్గర్లో డాక్టర్లెవరూ లేరు. కబురుపెట్టినా వాళ్ళు రావడానికి ఆలస్యం కావచ్చు. తక్షణం ఏదైనా సహాయం జరిగితేగాని కుర్రవాడు తేరుకునేటట్టు తోచదు...."

"అయితే మాత్రం! స్వంత వైద్యాలు చేయడంలేదని చెబుతుంటే మళ్ళీ బలవంతమా..."అడుగుల చప్పుడు వినిపించడంతో ముసలావిడ ఆగంతుకుడితో మాటలు చాలించి వెనుదిరిగి చూచింది. మందులసంచి చేతబట్టుకుని చెప్పులు తొడుక్కుంటోంది నీరజ.

◆ ◆ ◆

నీరజది నడకగా ముసలాయనది పరుగుగా యిద్దరూ సందుగొందుల్లో పడి ఒకటి రెండు ఫర్లాంగులదూరం నడిచారు.

ఓ చిన్న పెంకుటిల్లు. వీధి వైపుగదిలో ఓ చాపపైన స్మారకం లేకుండా పడివున్నాడు రోగి. అది మనిషి అడ్డంగా పడుకోడానికి వీల్లేనంత చిన్న గది. నిలువుగా పడుకొంటే మనిషికీ, ద్వారానికీ మధ్య ఓ మూరెడుజాగా మాత్రం మిగులుతుంది. మామూలు యిటుక రాళ్లతో కట్టిన గోడలే! గులకరాళ్ళు పరిచి గచ్చుచేసిన నేలే! ఐనా భూమిపైన నివసిస్తున్న మానవులకోసం అదే భూమిపైన గాలికీ వెల్తురుకూ దుర్భేద్యంగా ఓ చక్కటి భూగృహాన్ని నిర్మించిన ఘనత ఆ గృహవాస్తు శాస్త్రజ్ఞుడిది! కీర్తిశేషాలైన నల్లుల అవశేషాలుగా అలముకున్న నెత్తురు మరకలతో గోడలు యుద్ధభూములకు నమూనాలుగా వున్నాయి. పైకప్పునిండుకూ చాందినీ గుడ్డలా బూజు పేరుకపోయింది. ఇన్నిహంగులున్న ఆ గదిలో పాటకచ్చేరీ ప్రారంభించి చీగటీగలు తమ ఉచితజ్ఞతను చాటించుకుంటున్నాయి. చాపచుట్టురా కొన్ని దినపత్రికలు చెల్లా చెదురుగా పడివున్నాయి. ఓమూల పుస్తకాల గుట్ట ఒకటి, మరోమూల పాత ట్రంకుపెట్టె ఒకటి. వైద్యశాస్త్రంలో పట్టా పుచ్చుకున్న నీరజ ఆగదిలో అడుగుపెట్టిన మరుక్షణంలో తాను తన శత్రురాజ్యంలో ప్రవేశించినట్టు తెలుసుకోగలిగింది.

ముసలాయన చెప్పినట్టు రోగి బొత్తిగా కుర్రవాడేమీకాదు. పడుచువాడే, ఆ పడుచుదనం గూడా ప్రారంభదశలో వున్నట్టులేదు. ఆ గడ్డం పెరిగిన తీరు, ఆ తలవెంట్రుకలు చెల్లాచెదరై వున్నవాలకం, ఆ బొమికల ప్రోవు చాపకంటుకు పోయివున్న

హృదయ విదారకదృశ్యం- వీటిని బట్టి చూస్తే అతడు సుడిగుండాల్లో మునిగితేలి, ఝంఝామారుతాల అలజడికి అగ్గమై యిక ఓపరికం చాలక పోవడం వల్ల అలలు తీసుకొచ్చి తీరరేఖపైన దిగవిడిచిన ఓటి పడవలా వున్నాడు. ఓ వైపున మృత్యువులాంటి సముద్రం, మరో వైపున కన్న తల్లిలాంటి భూదేవి. నట్టనడుమ చెలియలి కట్ట నంటుకుని ఓటిపడవ. మొట్ట మొదటిసారిగా తాను పరిష్కరించవలసి వచ్చిన ఆ 'కేసు' ఎదుట కాసేపు మ్రాన్పడి నిల్చుండిపోయింది నీరజ.

వృద్ధుడు చెప్పుకపోతున్నాడు. "చూడు తల్లీ! మందో మాకో సూదోగీదో ఏదోఒకటి చూడాలి తక్షణం. రెండు రోజులుగా నేనింట్లో లేను. ఉంటే యిందాకా రానిచ్చే వాణ్ణిగాను. పుణ్యానికి పోతే పాపం ఎదురయ్యే రోజులు. ఇంట్లోవాళ్లు వద్దన్నా వినకుండా యితగాడి కీ గది అద్దె కిచ్చాను. నాలుగు మాసాలుండి మరెక్కడైనా బస చూచుకుంటానన్నాడు. చూచుకునేవాడే! ఇంతలో ఈ జబ్బొకటి వచ్చిపడింది. ఆసుపత్రికి వెళ్లి మందు పుచ్చుకుంటున్నా నన్నాడు. నయమైపోతుందనుకున్నాను. ఒక నాటి సాయంకాలం తలుపు తెరచి చూచే సరికి యితడిలా కొయ్యబారిపోతుంటాడని నాకేం తెలుసు! తీరా యిప్పుడు ఆసుపత్రికి తీసుకెళ్తే చేర్చుకుంటారో లేదో సందేహం, మీ చేతనైంది చేయండి డాక్టరమ్మగారూ! మీ మందు ఖర్చులకు నా కెలాగూ చేతి నుంచీ దండగ తప్పదు. ఏంచేస్తాను మరి! ఇళ్లుకట్టుకుని అద్దె లిచ్చుకున్న నేరానికి ఏ పీడవచ్చి తలకు చుట్టుకున్నా భరించాల్సిందే! తప్పుతుందేమన్నానా!"

ముసలాతడి ధోరణికి నీరజ చిరాకు పడిపోయింది. లోకానికి ఎదుటివాడు బ్రతుకుతాడా, బ్రతకడా అన్న విషయంపట్ల ధ్యాస తక్కువ. వాడి చావుబ్రతుకులవల్ల తనకు కలగబోయే లాభనష్టాలను బేరీజు వేయడంలో నిమగ్నమైవుంటుంది లోకం. డాక్టర్లు మాత్రం లోకంలోని మనుషులు కాదా అనవచ్చు. వాళ్ళూ మనుషులే! రోగికి నయం కావడం, కాకపోవడంకంటే వాళ్లకు తమ ఫీజుపట్ల పట్టింపు ఎక్కువ అంటూ యిక్కడొక ప్రతివాదం బయల్దేరే అవకాశం సైతం లేకపోలేదు. కానీ ఫీజులు గడించి మేడలు కట్టాలన్న పెద్ద పెద్ద ఆలోచన లేవీ నీరజకు లేవు. లేదంటే ప్రస్తుతం ఆమె అంతరాంతరాల్లో ఓ చిన్న కోరిక నిక్షిప్తమై వున్నమాట మాత్రం నిజం! ఈ రోగి తన చేతులమీదుగా గడిచి గట్టెక్కితే, అది తన వృత్తికి శుభ ప్రదమైన ప్రారంభంగా వుంటుంది.

రోగిని పరీక్షచేయడం పూర్తి కావచ్చింది. బాహ్యలక్షణాలనుబట్టి అశ్రమంగానే రోగనిదానం చేయగలిగింది నీరజ. ఎండిపోయిన పెదవులు, పిడచగట్టుకపోయిన నాలుక, ఉబ్బసంలాంటి ఉచ్ఛ్వాస నిశ్వాసాలు ఇవన్నీ శరీరాన్ని పీల్చి పిప్పిచేస్తున్న విషజ్వరానికి

చిహ్నాలు. ఈ రోగానికి రామబాణంలాంటి సూదిమందు కద్దు. కానైతే ఒక నియమం మాత్రం వుంది. వ్యాధి చేయి దాటిపోతున్న విషమ పరిస్థితిలో నేగానీ దాన్ని వాడగూడదు.

భగవంతుడిపైన భారం వేసింది నీరజ. సిరింజిలోకి మందెక్కిస్తూ "ఇతనికిక్కడ బంధువులుగానీ పరిచితులుగానీ ఎవరూ లేరటండీ?" అని ప్రశ్నించింది.

వృద్ధుడు పెదవి విరిచాడు. "ఏదీ ఎవరున్నారు? ఇక్కడే కాదమ్మా తల్లీ! ఈ లోకంలో మరెక్కడగానీ యితనికి కావలిసిన వాళ్ళంటూ లేరనే నా ఊహ. ఉంటే కనీసం జాబులైనా రావూ! ఇదివరకేదో గడియారాల కంపెనీకి ఏజెంటుగా పనిచేశానన్నాడు. ఊళ్ళు తిరగడంతో ఆరోగ్యం పాడైపోయిందట. డాక్టర్లు విశ్రాంతి తీసుకోమన్నారట! విశ్రాంతికోసం ఈయనగారిక్కడ మకాం వేశారు. ఇక్కడైనా గోళ్ళు గిల్లుకుంటూ కూర్చునేవాడు గాదు పాపం! ఏవో ఒకటి రెండు చిన్నవుద్యోగాలుచేసి మానుకున్నాడు. ఎప్పుడెదురైనా వినయంగా పలకరించేవాడు. మనిషి మంచివాడే! కానీ ఏం లాభం? బుద్ధి భూములేలమంటే కర్మ గాడిదలు కాయమంటుంది...."

వృద్ధుడిసాయంతో రోగిని సరిగ్గా పడుకోబెట్టి చొక్కా చేతిని మడిచి మోచేతి పైభాగంలో సూదెక్కించింది నీరజ. "పదిహేను నిమిషాల్లో గుణం కనిపించవచ్చు. కనిపిస్తే మనం మరికొంత ప్రయత్నం చేయవచ్చు. లేకపోతే ఆశ వదులుకోవలసి వుంటుంది. ఆ లోపల మీరు ఓ గ్లాసుడు వేడిపాలు పుట్టించగలిగితే ఎందుకైనా మంచిది. రోగం యిలా ముదిరిపోవడానికి సరైన మందు లేకపోవడం మాత్రమే గాదు, సక్రమమైన ఆహారం లేకపోవడం గూడా ఒక కారణమే...."

"పాలా! ఆదెక్కడ దొరుకుతుంది? ఇంత రాత్రివేళ....."

నీరజకు చిర్రెత్తుకొచ్చింది. "అదేమిటండీ! ఇక్కడ మరొక మనిషి ప్రాణంతో వ్యవహరిస్తున్నారన్న సంగతి మరిచిపోగూడదు. వెళ్ళండి. ఇంత పట్టణంలో పాలు దొరక్కపోదు. ఎక్కడైనా టీస్టాల్లో అడిగిచూడండి...."

నీరజకోసం వసారాలో వాలుకుర్చీ వేసి ముసలాయన గ్లాసుతీసుకుని వీధిలోకి వెళ్ళిపోయాడు. చీకటి గుయ్యారంలా వున్న గృహాంతర్భాగం కేసి చూస్తూ కుర్చీలో కూర్చుంది నీరజ. అప్పటికీ ఆ ముసలాతడే కాస్తానయం. ఈ యింట్లో మిగిలిన వాళ్ళందరూ గాఢంగా గురకలు పెడుతూ నిద్రపోతున్నారు. బుడ్డీదీపం ఒకటి వెలుగుతుండ బట్టి సరిపోయిందిగానీ లేకుంటే రోగి పడివున్న గదిలోగూడా అంధకారం తాండవించేదే! ఆ గుడ్డి దీపమైనా యింకెంతసేపు వెలుగుతుంది? తడిసోకని వత్తిచివర దాని బ్రతుకుగూడా సందిగ్ధావస్థలో కొట్టుమిట్టాడి పోతోంది.

నీరజ నిట్టూర్చింది. దేని పట్ల నిర్లక్ష్యం చూపగూడదో దానిపట్ల నిర్లక్ష్యం చూపుతున్నారు మానవులు. డబ్బుతో కొనరానిదీ, మేధస్సుతో సృష్టింపరానిదీ అయిన 'ప్రాణం' ఒక్కొక్కచోట తృణంకన్నా హీనంగా నిరాదరింపబడుతోంది. ఒకప్రాణం కోసం శరీరంలోని కండలుకోసి సమర్పించుకున్న త్యాగశీలతను గురించి కథలు చెప్పుకునే దేశంలో దౌర్భాగ్యమానవులు కొందరు, కంట తడిపెట్టేవారైనా లేకుండా క్రిమికీటకాల్లా చనిపోతున్నారు.

నిటారుగా కూర్చునే ఓపికలేక కుర్చీలో వాలిపోయింది నీరజ. కరడుగట్టుక పోయిన నిస్తబ్ధతలో చేతిగడియారం టిక్కు టిక్కు మంటున్న శబ్దంగూడా ఆమెకు స్పష్టంగా వినిపిస్తోంది. మెల్లగా నిమిషాలు దొర్లిపోతున్నాయి. పదిహేనుమిషాల గడువుగూడా దాటిపోవస్తోంది.

ఉన్నట్టుండి గదిలోనుంచీ రోగి మూలుగు వినిపించినట్టు తోచడంతో తటాలున లేచి నిల్చుని నీరజ గదిలోకి తొంగిచూచింది. నిజమే! రోగిలో చలనం ప్రారంభమైంది. గాలిలో ఎండుటాకుల్లా అతడి పెదవులు కదులుతున్నాయి.

శ్వాసక్రియ స్వేచ్ఛగా జరగడానికి వీలుగా అతడి తలక్రింద తలగడ నుంచగలిగితే బాగుండుననుకుంది నీరజ. పుస్తకాలు తప్పితే ఆ గదిలో తలగడగా ఉపకరించే వస్తువులు లేవీ లేవు. గుట్టలావున్న గ్రంథ సముదాయంలోంచి ఆమె ఓలావుపాటి పుస్తకం పైకితీసింది. దుమ్ముదులిపి ఆపుస్తకాన్ని తలగడగా అమరించివుండేదే నీరజ. కానీ దుమ్ము దులుపుతుండగా పుస్తకంలో నుంచి క్రిందికి జారిన కాగితం ముక్కలు ఆమెను ఆశ్చర్యంలో ముంచేశాయి. ఒక దానితర్వాత ఒకటిగా ఆమె కాగితాలన్నింటినీ చేతికి తీసుకుని, దీపకాంతిలో వాటిని తదేకదృష్టితో పరిశీలిస్తూ విగ్రహంలా నిల్చుండిపోయింది.

అవి మామూలు కాగితంముక్కలుగావు. మనియార్డరు రసీదులు!

ప్రతిరసీదులోనూ 'మనియార్డరు పుచ్చుకున్న వారి సంతకము' అన్న ముద్రితాక్షరాలకు పైన తాను స్వయంగా చేసిన తన సంతకం నీరజ కళ్లకు అసందిగ్ధంగా కనిపిస్తోంది! నీరజకు కలిగిన ఆశ్చర్యాన్ని మాటల్లో వర్ణించడం దుస్తరం.

మహాప్రకాశంలో కనుచూపు చెదరి అంధత్వం ప్రాప్తించినట్టుగా హద్దులుదాటిన ఆశ్చర్యంలో నీరజ మనసు చైతన్యంగోల్పోయి స్తబ్ధమైపోయింది.

అలా తానెంతసేపు నిల్చుందో నీరజకు తెలియదు. "పాలు తెచ్చానండి డాక్టరమ్మ గారూ!" అన్న వృద్ధుడి పలకరింపుతోగానీ ఆమె మళ్లీ మామూలు స్థితికి రాలేకపోయింది.

పాలగ్లాసును చేతికి తీసుకుని రోగిదగ్గరే కూర్చుంది నీరజ. చెంచాతో పాలుతీసి రోగి పెదవులకందిస్తున్న నీరజనుచూచి వృద్ధుడు విస్మయచకితుడై పోయాడు. ఓ డాక్టరు చికిత్స చేస్తున్నట్టుగా లేదు, ఆ దృశ్యం ఎవరో ఆత్మీయురాలు రోగికి సపర్యలు నెరపినట్టుగా వుంది!

పదినిమిషాలు గడిచిన తరువాత మళ్ళీ వృద్ధుడే పలకరించాడు. “అర్ధరాత్రి కావస్తోందమ్మగారూ! మిమ్మల్ని యింటిదగ్గర వదిలిపెట్టి వస్తాను....”

“ఎందుకూ నేనిక్కడే వుంటాను” అంది నీరజ.

అప్రయత్నంగా వెలువడిన ఆ జవాబులో 'నన్నిక్కడినుంచి వెళ్ళిపొమ్మనడానికి నువ్వెవరివి' అన్న అర్థంధ్వనించిందేమో మరి, వృద్ధుడి విస్మయం ద్విగుణీ కృతమైపోయింది.

◆ ◆ ◆

నీరజ మనోవీధిలో పూర్వస్మృతులు నాటకంలో దృశ్యాలకు మల్లే కదిలిపోతున్నాయి.

గాలిలో చిన్నదీపం వెలిగించి తన తల్లి దండ్రులిద్దరూ చనిపోయారు. భగవదనుగ్రహం తాతయ్యరూపంలో తనను ఆదరించింది. చల్లటి గానుగచెట్టు నీడలాంటిది తాతయ్య ఆదరణ. ఆ నీడలో తాను తల్లి దండ్రులు లేని కొరతను మరచిపోగలిగింది.

లోకమంటే ఒకపూలతోట. ఆడుకోవచ్చు. పాడుకోవచ్చు. బొమ్మరిళ్ళుకట్టుకోవచ్చు. గుజ్జనగూళ్ళు వండుకోవచ్చు- అన్న అమాయికభావనలతో తనచిన్ననాటి రోజులు మధురస్వప్నంగా గడిచిపోయాయి.

తాతయ్య తనను హైస్కూల్లో చేర్పించాడు. వందలాది బాలబాలికల్లో తనకొక ప్రత్యేకస్థానం వుండేది. ఈ పిల్లకు మంచి భవిష్యత్తు వుందనుకునేవాళ్లు టీచర్లు. పరీక్షలు వ్రాసి బాగామార్కులు సంపాదించడమే మంచి భవిష్యత్తుకు రాచబాటని తనారోజుల్లో తలపోసింది. జీవితం అందమైనదిగానూ, ఆనందకరమైనదిగానూ అప్పుడు తనకు భాసించింది.

ఐతే ఆ అజ్ఞానపు తెరలు క్రమక్రమంగా తొలగిపోతూవచ్చాయి. పరిస్థితులు తమ నిజస్వరూపంతో ప్రత్యక్షమైనకొద్దీ తనలో బ్రతుకంటే భయంరగులుకోసాగింది. ఏక్షణాన్నయినా రాలిపోవడానికి సిద్ధంగావున్న పండుటాకు తాతయ్య. ఆయనకు పరువు ప్రతిష్ఠలేగాని ఆస్తిపాస్తులులేవు. పట్టణం చివర ఆశ్రమంలాంటి కుటీరంలో ఆయన నివాసం. ఆ కుటీరమైనా ఆయన స్వంతంగాదు. కట్టుకంబానికి కట్టిపెట్టినగొడ్డులా తన

కుటుంబంకోసం బ్రతికినవాడుగాదు తాతయ్య. ఆయన సమాజంకోసం బ్రతికాడు. సంఘంలో చైతన్యం తీసుకురావాలని ఆకాంక్షించి అందుకోసం బ్రతుకును మీదుకట్టిన మహానీయుల అడుగుజాడల్లో ఆయన నడిచాడు. వితంతు వివాహాలు, అస్పృశ్యతా నిరాకరణ, కులభేదాల ప్రసక్తిలేకుండా సహపంక్తి భోజనాలు మొదలైనవి ఘోరాపచారాలుగా భావింపబడినరోజుల్లో ఆయన ముందుండి అలాటి ఉద్యమాలను నడిపించాడు. లోకులు రాళ్లురువ్వినా, బంధులోకం ఆంక్షలు విధించినా ఆయన అచంచలంగా తన ఆదర్శానికి కట్టుబడి నిలిచాడు.

తాతయ్య గవర్నమెంటు పాఠశాల్లో టీచరు. కొంతకాలం హెడ్మాస్టరుగా గూడా పనిచేశాడు. జీతం క్రింద ప్రతినెలా ఆయనకెంతో కొంతడబ్బు ముడుతుండేది. ఐతే అందులో సగానికిసగం పేదవిద్యార్థుల బడిజీతాల క్రింద, పుస్తకాల క్రింద ఖర్చయి పోతుండేది. ఒక్కొక్కనెల జీతం తీసుకున్న రోజున ఆయన ఖాళీ జేబుతో గూడా యింటికి రావడం జరుగుతుండేది. అమ్మమ్మ ఈ లోకపు మనిషిగాదు. తాతయ్య అడుగులకు మడుగు లొత్తడం మాత్రమే ఆమెకు తెలుసు. ఆయన చేసిన పనిలో తప్పులు పట్టడం ఆమెకు తెలియదు.

తాతయ్యకు వైద్యంగూడా వచ్చు. ఆయన బోర్డు తగిలించుకోని నాటు వైద్యుడు. వైద్యం ఆయనకు వంశానుగతంగా సంక్రమించిన విద్య. ఐతే ప్రతిఫలం ఆశించినప్పుడు తన వైద్యం ఫలించదని ఆయన విశ్వాసం. ఆ వైద్యంపట్ల గూడా కొందరికి విశ్వాసం వుండేది. అర్ధరాత్రప్పుడు మూడు జాములప్పుడు ఎవరెవరో వచ్చి తలుపుతట్టి తాతయ్యను తీసుకెళ్లిపోయేవారు. బ్రతకడానికి ప్రతిజీవికీ హక్కుందని చెబితే చాలదు, దిక్కుగూడా వుండాలి అని ఆయన చెబుతుండేవారు. ప్రతి మానవుడికీ కడుపునిండుకూ తిండి, ఒంటికి బట్టా, రోగానికి మందు- ఈ మాత్రమైనా పూచీపడకపోతే శతాబ్దాలుగా వికసిస్తూ వచ్చిన మానవనాగరికత కేవలం ప్రహసన ప్రాయమేననీ ఆయన వాదిస్తుండేవాడు. ఇంటి కెవ్వరైనా అతిథులు వచ్చినప్పుడు తనను చూపించి "చూచారటండీ! మా అమ్మాయికి పద్నాలుగేళ్లు పూర్తికాలేదు. అప్పుడే ఫిఫ్తుఫారం చదువుతోంది. నా తల్లిని డాక్టర్ చదివిస్తాను. ఆడవాళ్లు చదవడమంటే నాకు చాలా యిష్టం. కానీ ఒక షరతు. వాళ్లు కుర్రవాళ్ళకు పాఠాలైనా చెప్పాలి. లేదా రోగులకు పరిచర్యలైనా చేయాలి" అంటుండేవారు.

చదివించడానికి చదివించాలన్న సద్దుదేశం ఒక్కటి మాత్రమే చాలదనీ, అందుకు మరి కొన్ని హంగులుండాలని అప్పట్లో తాతయ్యకే గాదు, తనకు సైతం తోచిందిగాదు!

అవసానదశలో తాతయ్యకు పాతికరూపాయల పెన్షను తప్పితే యితరత్రా

జీవనాధారం లేదు. ఆపాటి రాబడిలో ఆయన జీవిత శేషాన్ని నిశ్చింతగా గడపగలిగి వుండేవారే. కానీ తన చదువుకోసం ఆయన ఆర్జనకు పూనుకోవలసి వచ్చింది. శరీరంలో ఓపిక లేకపోయినా ఆయన పదిమంది కుర్రాళ్ళకు ట్యూషను చెబుతుండేవాడు. ఆ అదనపు రాబడిని నమ్ముకునే ఆయన తనను కాలేజికి పంపడం జరిగింది.

తనకూ దురదృష్ట దేవతకూ సంకుల సమరం ప్రారంభమైంది గూడా అప్పటి నుంచే!

కాలేజిలో చేరిన కొంత కాలానికే యింటి దగ్గర నుంచీ పిట్టపిడుగులాంటి వార్త వచ్చింది. తాతయ్య యిక పైకిలేవలేరు. ఆయన కాళ్ళు రెండూ పడిపోయాయి. మనిషిని జీవచ్ఛవంలా మంచంపైన పరుండబెట్టే ఆ భయంకరమైన వ్యాధిపేరు పక్షవాతం!

సెలవుల్లో యింటికి వెళ్ళినప్పుడు తను తాతయ్యదగ్గర కూర్చుని విలపించింది. ఇక చదువు మానేసి ఏదైనా చిన్న వుద్యోగం చూచుకుంటానన్నది. ఐతే తాతయ్య ససేమిరా ఒప్పుకున్నారుగాదు. "చూడు తల్లీ! నా జీవితంలో నేను చేబట్టిన ప్రతి కార్యంలోనూ నాకు విజయమే సమకూరింది. నిన్ను చదివించాలన్నది నా చిట్ట చివరి ప్రయత్నం. ఈ ప్రయత్నంలో నేను కృతకృత్యుణ్ణి ఔతానో కానో తేల్చుకోవాలి. నువ్వు నాకోసమైనా చదువుకోవాలి. తప్పదు" అన్నారు.

అన్నారేగానీ ఎలా చదివించగలరో తన కర్థం కాలేదు. ఐనా తాతయ్య పట్టుదలవల్ల తను మళ్లీ కాలేజికి వెళ్ళక తప్పలేదు. యథాప్రకారంగా ప్రతినెలా డబ్బు చేతికందుతుండేది. అసలు రహస్యం యింటరు పరీక్షలు వ్రాసి యింటికి వెళ్ళిన తర్వాతగానీ తనకు తెలిసీ రాలేదు. ఇల్లు అయ్యవారి నట్టిల్లులా సర్వశూన్యంగా వుంది. పాత కాలంనాటి కుర్చీలు, బీరువాలు మటుమాయమైపోయాయి. పాత్ర సామగ్రి కంటికి కనిపించడం లేదు. ఆఖరుకు అమ్మమ్మ చెవుల్లో కమ్మలు గూడా లేవు!

అంతటితో దారుణ నిదాఘంలో మండుటిసుకపైన యింకిపోయిన ప్రవాహంలా తనను చదివించాలన్న కోరిక తాతయ్యలో అణగారిపోయి వుండవచ్చుననే తను భావించింది.

కానీ విధికి మానవులతో చెలగామాడట మంటే సరదా! తన సరదాకోసం అది అప్పుడప్పుడూ కొన్ని తమాషాపనులు చేస్తుంటుంది. ఇంటరు పరీక్షల్లో తను కళాశాల కంతా ప్రథమస్థానంలో నెగ్గింది. ఆ మార్కుల మూలంగా తనకు మెడికల్ కాలేజిలో సీటు మాత్రమేగాదు, స్కాలర్‌షిప్పు గూడా లభించే అవకాశం దృగ్గోచరమైంది.

ఇప్పుడేం చేస్తావన్న ఈ కడసారి సవాలు గూడా తాతయ్య ఆత్మవిశ్వాసంతో ఢీకొన లేకపోయింది. కళ్ళుమూసుకుని, పిడికిలి బిగపట్టి, దృఢనిశ్చయంతో "నాకు నమ్మకం

వుందితల్లీ! నీ చదువు మధ్యలో ఆగిపోదు. మనకు భగవంతుడి తోడ్పాటు తప్పకుండా లభిస్తుంది. నువ్వువెళ్లి కాలేజిలో చేరు" అన్నారాయన.

దురదృష్ట దేవతకూ తనకూ జరిగిన సంకుల సమరంలో అది పతాకస్థాయి!

మెడికల్ కాలేజిలో చేరిన రెండుమాసాలకు తాతయ్య తనకొకజాబు వ్రాశారు. ఆశ నిరాశలు పడుగుపేకలా కలిసిపోయిన ఆ ఉత్తరంలోని ప్రతివాక్యమూ తనకింకా బాగా జ్ఞాపకం. వణుకుతున్న వ్రేళ్లతో కూర్చునే వీలులేక రోగశయ్య పైన పడుకుని ఆయన వ్రాసిన ఆ చివరిలేఖ తలచుకోగానే తన మనో ఫలకంపైనా సాక్షాత్కరిస్తుంది.

"చిరంజీవి నీరజకు శుభాశీస్సులతో మీ తాతయ్య వ్రాయునది-

అమ్మాయి! నా ఆరోగ్యం నానాటికీ దిగజారిపోతోంది, ఇహానికీ పరానికీ మధ్య అంచుపైన నేను నిలబడిఉన్నాను. ఈక్షణాన నా ఆలోచనలను యిహం వైపుకు లాక్కుంటున్న లంకెలు రెండు. ఒకటి మీఅమ్మమ్మ. రెండోది నువ్వు. మీ అమ్మమ్మను గురించి  నాకంత దిగులు లేదు. ఆమెకు నువ్వున్నావు. నీకెవ్వరూ లేరు. నువ్వు నీ గమ్యస్థానానికింకా చాలా దూరంలో వున్నావు. ఇంతవరకు నువ్వా గమ్యం చేరుకోగలవనే నేనాశించాను. ఐతే నా యీ జీవితచరమాంకంలో ఆ ఆశ క్రమక్రమంగా సన్నగిల్లి పోతోంది.

త్వరగా గడచిపోకుండావున్న రోజులు, నిద్రపట్టని రాత్రులు, ఎడ తెగని ఆలోచనలు, స్పష్టంగా ప్రకటితంగాని వ్యథలు- ఇవన్నీ నా మనశ్శాంతిని పాడుచేస్తున్నాయి. ఒక్కొక్కప్పుడు నాకీ పక్షవాతం రావడం గూడా మంచికేననిపిస్తోంది. ఇది రాకుంటే నా నిస్సహాయత్వం నాకు తెలిసేదిగాదు. నేనొక అల్పజీవినన్న సత్యం నాకూ గోచరించేదిగాదు.

ఇటీవల నేను కొందరు మిత్రులకు, పరిచితులకు జాబులు వ్రాశాను. నేనెప్పుడో ఉపకారాలు చేశానని చెప్పడమూలేదు. అందుకు ప్రతిఫలం కోరడమూలేదు. చేతులు జోడించి దీనంగా యాచించాను. నా ఉత్తరాలకు ప్రత్యుత్తరాలు లేవు. నా ప్రార్థన అరణ్యరోదనం క్రింద పర్యవసించింది. ఏం చేయమంటావు తల్లీ! ఇంతకాలంగా నేనేదో భ్రమలో బ్రతికాను. ఇప్పుడు నా చేతకానితనాన్ని ఒప్పుకుంటున్నాను.

ఇంతటితో నేనీ జాబును పూర్తిచేసి పోస్టుచేసి వుండేవాడినే. ఐతే అదేంచిత్రమో గానీ నువ్వు చదువు ప్రారంభించిన నాటి నుంచీ మనకు అంధకారంలో ఆశాకిరణాలు కనిపిస్తూనే వున్నాయి. ఇటీవల జరిగిన ఓ విచిత్రోదంతాన్ని వివరించి, ఉత్తరం ముగిస్తాను.

పదిరోజులప్పుడు పాతికేళ్ల యువకుడొకడు నాకోసం వెదుక్కుంటూవచ్చాడు. వచ్చినవాడు తానొక పత్రికా విలేఖరినని చెప్పుకున్నాడు. నా దురవస్థకు చాలా విచారించాడు. నేనంగీకరించినట్లయితే నన్ను గురించి ఓ వ్యాసం వ్రాసి పత్రికలో

ప్రకటిస్తానన్నాడు. నాకు నవ్వొచ్చింది. వెంటనే ఒళ్లు మండిందిగూడా! అలాంటి వ్యాసం ప్రకటించడం నా కిష్టమేననీ, ఆ వ్యాసం ప్రకటింపబడిన కాగితం పొట్లాలు కట్టుకోవడానికి ఉపకరిస్తే అందువల్ల చనిపోయిన తర్వాత గూడా నా ఆత్మకు శాంతి చేకూరవచ్చుననీ అతనికి బదులు చెప్పాను.

పాపం! అతని ముఖాన కత్తివేటుకు నెత్తురుచుక్కలేదు.

దిగాలుపడి తల వంచుకుని అతడు వెళ్లిపోయాడు. అతడి రాకపోకలకు నేనంత ప్రాధాన్యం యివ్వలేదు గూడా! కానీ యింతలో అతడి దగ్గరినుంచీ ఓ ఉత్తరం వచ్చింది.

ఇదేమిటో విడ్డూరంగానే వుంది మరి! ఈ విశాలాంధ్రావనిలో ఎక్కడో మానవసేవా సమితి అన్న పేరుతో ఒక సంస్థవుందట. సంఘానికి అంతో యింతో సేవ చేసిన నాలాటి వాళ్లకు వార్ధక్యదశలో కొంత ఆర్థిక సహాయం చేయడం ఆ సంస్థ కార్యక్రమంలో ఒక భాగమట! తానా సమితి కార్యకర్తలతో సంప్రదించాననీ, వాళ్ళు నాకు నెలానెలా ముప్ఫైరూపాయ లివ్వడానికి అంగీకరించారనీ అతడు తన ఉత్తరంలో పేర్కొన్నాడు!

నా కళ్లను నేను నమ్మలేకపోయాను. నమ్మడానికి వీలున్న విషయం కాదిది. కానీ యిదేదో అయాచితమైన సహాయం. లభిస్తే సంతోషమేగానీ, లభించకపోతే విచారం వుండదు. అందుకనే, ఆ సహాయం మాట నిజమే అయితే దబ్బును నీ చిరునామాకు పంపే ఏర్పాటు చేయమని ఆ యువకుడికి ప్రత్యుత్తరం వ్రాశాను.

సముద్రంలోపడి మునిగిపోతున్నవాడు ఏ మాత్రం కర్రముక్క చేతికి దొరికినా దాని సాయంతో బయటపడాలని ఆశిస్తాడు. జీవికి ఆశ సహజం. మనమూ వేచిచూద్దాం. బదులు రాస్తావుగాదూ....."

అది తాతయ్య ఉత్తరం.

అందులో ఆయన వ్రాసినట్టు రెండు వారాలు తిరగక మునుపే సేవాసమితి కార్యదర్శి దగ్గరినుంచి తనకు మొదటి మనియార్డరు వచ్చింది.

ఆ తరువాత ఒక్క నెలగూడా తప్పిపోకుండా తనకు యం.ఓ.లు అందుతూ వచ్చాయి.?

మధ్యలో ఒకసారి తాతయ్య చనిపోయినప్పుడు తనావిషయం తెలియజేస్తూ జాబు వ్రాసింది. ఐతే మనియార్డర్లు ఆగిపోలేదు. కోర్సు పూర్తయిందని తెలుపుకున్న రెండు మాసాలకు అవి ఆగిపోయాయి.

ఐతే మానవసేవా సమితిని గురించి కొన్ని సందేహాలు మాత్రం తనలో అలాగే వుండిపోయాయి. నెలనెలా తనచేతికొస్తూ వుండిన మనియార్డర్లు ఒక్కచోటనుంచీ వచ్చినవి గావు. ఒక నెల నెల్లూరునుంచీ, మరొకనెల హైదరాబాదునుంచి, ఇంకొక నెల

బెంగుళూరునుంచీ యిలా అవి దేశం నలుమూలల నుంచీ వస్తుండేవి. సమితి కార్యాలయం ఇలా నిరంతర దేశ పరిభ్రమణం సల్పడంలోని ఆంతర్యమేమిటో తనకు బోధపడేది గాదు. మళ్లీ ఆశ్చర్యమేమిటంటే మనియార్డరు కూపన్లమీది దస్తూరిలో మాత్రం కించిత్తు విభేదమైనా పొడసూపేది గాదు. ఈ చిదంబర రహస్య మేమిటో తెలుసుకోవాలన్న కుతూహలంతో తను రకరకాలుగా వాకబుచేసి చూచింది. ఐతే ఆ మానవసేవా సమితి యొక్క ఆచూకీ తెలిసినవాళ్ళొక్కరైనా తనకు తటస్థించలేదు.

♦ ♦ ♦

"నే నెక్కడున్నాను?" నూతిలోనుంచి వెలువడినంత నీరసంగా, ఆ ప్రశ్న అస్పష్టంగా వినిపించింది.

"ఇక్కడ వున్నారు..." మృదువుగా ప్రత్యుత్తరమిచ్చింది నీరజ.

రోగి నీరజవైపు పరకాయించి చూచాడు. సిద్ధహస్తుడైన శిల్పి మలిచి నిలబెట్టినట్టున్న చలువరాతి విగ్రహంలా వుంది నీరజ. మృత్యు వక్త్రంలోనుంచి బయటపడిన ఆ దుర్బలుడికి బ్రతకడంలోని మాధుర్యమంతా మూర్తి కట్టితన మ్రోల ప్రత్యక్షమైనట్టుగా వుంది నీరజ. అంతలో అతడికొక భ్రమ కలిగింది. తను నిజంగా బ్రతకలేదేమో! చనిపోయి స్వర్గానికి వెళ్ళగా అక్కడొక అశ్వినీదేవత తనకు శుశ్రూష చేస్తున్నదేమో...

అతడొకసారి కళ్లు మూసుకొని మళ్లీ తెరిచాడు. ఈవ లావలకు చూపులు త్రిప్పి గదిలో వెలుగుతున్న విద్యుద్దీపాన్ని బట్టి, బల్లపైన ప్రశాంత గంబీరమైన వదనముద్రతో సాక్షాత్కరించిన బుద్ధ భగవానుడి విగ్రహాన్ని బట్టి నీరజ కనురెప్పల కదిలికను బట్టి తనింకా మానవలోకంలోనే వున్నట్టు నిర్ధారించుకోగలిగాడు.

అతడి కళ్లల్లోనుంచి కృతజ్ఞత తెరలు తెరలుగా పెల్లుబికి చూపులతో కలసివచ్చి నీరజను అభిషేకించింది. రొమ్ముపైన వాడిపోయిన తోటకూరకాడల్లా పడివున్న అతడి చేతులు మెల్లగా పైకి కదలి ఒకదానినొకటి సమీపించాయి.

దగ్గరగా వచ్చి అతడి నా ప్రయత్నం నుంచి వారిస్తూ "అలాంటిపని చేసి మీరు నన్ను బాధించగూడదు. మీరు నమస్కరించ వలసినంతటి గొప్పతనం నాలో లేదు" అంది నీరజ.

"ప్రాణ మిచ్చినవారికి నమస్కరించడంలో తప్పులేదు. మీరెవరో నాకు తెలియదు. ఆ మురిక కూపంలో నుంచి నేనిక్కడి కెలా వచ్చానో తెలియదు. మీరు నిల్చునే వున్నారు. దయచేసి ఆ కుర్చీపైన కూర్చోగూడదూ..."

"కూర్చుంటాను గానీ మీరు నేను చెప్పినట్టు వినాలి..."

అతడు నవ్వాడు. "ఏం చెబుతారు మీరు! మీరేం చెప్పినా నేను వింటాను. కానీ మీ రెవ్వరో నన్ను తెలుసుకోనివ్వక పోవడం మీకు ధర్మం కాదు..."

నీరజ గూడా నవ్వింది. "ధర్మా ధర్మాల వివరాలను గురించి తీరిగ్గా చర్చించుకోవచ్చు. ఇది మీరు మాట్లాడ్డానికి సమయం కాదు. ఇప్పుడు మీరు బాగా విశ్రాంతి తీసుకోవాలి..."

నీరజవైపు గాకుండా అతడు పైకప్పుకేసి చూస్తూ చెప్పుక పోసాగాడు. "మీరు నన్ను దీర్ఘ విశ్రాంతిలోనుంచి లేపారు. ఇప్పుడు మళ్లీ విశ్రాంతి తీసుకోమని చెబుతున్నారు. మీతో నేను చాలా విషయాలు చెప్పుకోవాలి. ఇలా నేను రక్షింపబడటానికి యిది రెండోసారి. వింటే మీ కాశ్చర్యంగా వుండొచ్చు. భూమిపైన పుట్టడానికి మునుపే చనిపోయివుండవలసిన దురదృష్టవంతుణ్ణి నేను..."

"పోనీ, సంగ్రహంగా చెప్పి ముగించండి" అంటూ కుర్చీని మంచం దగ్గరికి జరుపుకుంది నీరజ.

ఆ దురాగతాన్ని భ్రూణహత్య అంటారు. మా అమ్మకు చిన్నతనంలో ఎప్పుడో బొమ్మలపెళ్లి లాంటి పెళ్ళితతంగం ఒకటి జరిగింది. పెళ్ళి జరిగిన రెండేళ్ళకే వైధవ్యం ప్రాప్తించింది. బందిఖానా లాంటి ఇంట్లో, తన వాళ్ళకామె వెట్టిచాకిరీ చేస్తుండగా పదేళ్లు గడిచిపోయాయి. అప్పుడే నేనామె కడుపులో పడ్డాను.

అక్కడ కాసేపాగి అతడు నీరజవైపు చూశాడు "చెప్పండి" అంది నీరజ.

"మీ రర్థం చేసుకోగలరు గనుక విశేషించి చెప్పడంలేదు. తనను నమ్మించిన వ్యక్తి పాదాలు పట్టుకుని ఆమె ఎలా విలపించి వుంటుందో మీరూహించుకోగలరు. అతడు గూడా ఆమె నీ అపాయం నుంచి రక్షించాలనుకొన్నాడు. ఆ వూళ్లో పంతులుగారు గొప్ప వైద్యులని ప్రతీతి అతడు వెళ్ళి పంతులుగారిని యాచించాడు. ఎందుకోసమను కుంటున్నారు. గర్భస్రావానికి మందుకోసం!"

లోకంలో కొందరిపట్ల మాత్రమే సార్థకమౌతుంది. పంతులుగారిలాంటివారు తప్పుడు అంచనావేసుకుని తనదగ్గరికి వచ్చిన ఆ యువకుణ్ణి ఆయన చురచుర చూచారు. ఆ మట్టి ముద్దలో ఉత్తేజాన్ని రగుల్కొలిపారు. మనిషిగా పుట్టినవాడివి మనిషిగానే బ్రతకమని బుద్ధి చెప్పారు.

ఉద్యోగానికి సిపార్సుచేస్తూ ఆయన తన స్నేహితుడికి వ్రాసియిచ్చిన చీటీతో, చేతి ఖర్చుల కోసం యిచ్చిన డబ్బుతో మాఅమ్మానాన్నా, దూరప్రాంతాలకు వెళ్లి పెళ్లి చేసుకున్నారు. ఆ పెళ్లి జరిగిన మూడుమాసాలకు నేను పుట్టాను.

పంతులుగారిని గాకుండా మానాన్నగారు మరొకరిని ఆశ్రయించినట్టయితే ఒకటి రెండు జీవితాలు సర్వనాశనానికి గురైవుండేవి. ఆయన యింకా కళ్ళుతెరవని పసినిసుగును

కాపాడారు. దుర్గతికిలోను కావలసిన ఒక అబల జీవితంలో వసంతాలు వెలిగించారు. సంజవేళల్లో నట్టింటదీపం వెలిగించినప్పుడల్లా మా అమ్మ ఆయన్ను తలచుకునేది. పంతులుగారి పేరు పార్థసారధిగారు. ఆయనపట్ల గల భక్తి భావంతో మా అమ్మ నాకాపేరు పెట్టుకుంది...."

చేత గొడుగుతో, పొడుగాటి కోటుతో, తెల్లటి తలపాగాతో, చిరునవ్వులు మెరుగులు దిద్దుతున్న నెరసిన మీసాలతో నీరజ మనో నేత్రాలకు తాతయ్య ఆకృతి ప్రత్యక్షమైంది.

"ఇప్పుడు మీరు నన్నిలా రెండోసారి రక్షించారు...."

నీరజ అడ్డు తగిలింది. "ఇందులో నా గొప్పేమీ లేదు. నేను డాక్టర్ని. మీరు పేషంటుగా నా దగ్గరి కొచ్చారు. మీ జబ్బును నేను నయం చేయగలిగాను. అది నా వృత్తి ధర్మం...."

కుర్చీలో నుంచి లేచి నీరజ మెల్లగా బయటకు వెళ్లిపోయింది.

◆ ◆ ◆

వారం రోజుల తర్వాత ఓ ఉదయం అయిదు గంటలకే నిద్రలేచి డాబా పైన పచార్లుచేసి క్రిందికి దిగివచ్చాడు సారధి. నీరజ గదిలో కూర్చుని పత్రిక చదువుకుంటోంది.

సారధి కనిపించగానే పరామర్శించింది నీరజ. "అప్పుడే ప్రాతఃకాల విహారాలు ప్రారంభించారన్నమాట!"

గదిలో ప్రవేశించి కుర్చీలో కూర్చుంటూ "ఈ మొదటి తరగతి రాజకీయ ఖైదీకి ఆ మాత్రం స్వేచ్ఛ వుందనే నేను భావిస్తున్నాను" అన్నాడు సారధి.

"అమ్మో, మీరు చమత్కారంగా గూడా మాట్లాడగలరే! నేనింకా ఏమిటో అనుకున్నాను...."

నీరజ మళ్ళీ పత్రికా పఠనంలో లీనమైంది.

ఏదో మాట్లాడ దలచుకున్నట్టుగా సారధి గొంతు సవరించుకున్నాడు. కాసేపు నేలవైపు చూచాడు. మళ్ళీ తలపైకెత్తాడు....

"ఏమిటో చెప్పదలచుకున్నా రల్లేవుంది ...." నీరజ ప్రసంగానికి దారితీసింది.

"మరేంలేదు, మీరు చేసిన మేలుకు ఎలా ధన్యవాదాలు చెప్పుకోవాలో నాకు తోచడంలేదు. మీ ఉపకారాన్ని నేను జన్మలో మరచిపోను. కానీ మీ మంచితనాన్ని ఆసరాగా చూచుకొని నే నెంత కాలమైనా మీకు అతిథిగా వుండిపోలేను. ఒకటి రెండు రోజులనుంచీ మీ దగ్గర సెలవు తీసుకోవాలనుకుంటున్నాను...."

పత్రిక వెనుక ముఖం దాచుకుని "ఐతే మీరు బిల్లు చెల్లించకుండానే వెళ్లిపోతారన్న మాట" అంది నీరజ.

సారధి నొచ్చుకున్నాడు, "అలాంటి కృతఘ్నుణ్ణిగాను. నే నిప్పుడు నిర్ధనుణ్ణి. కానీ నా సంపాదనా శక్తిపైన నాకు నమ్మకం వుంది. త్వరలోనే మీ ఋణం తీర్చుకోగలను..."

చేతిలోని పత్రికను టేబిలుపైన పడేసి "అలాగైతే మీరు తప్పకుండా వెళ్ళదలచుకున్న పక్షంలో ఈ బిల్లునుగూడా మీతోబాటు తీసుకెళ్ళండి..." అంటూ మేజా సొరుగులోనుండీ ఓ కవరుతీసి సారిధి చేతికందించింది నీరజ.

కవరుచించి కాగితం పైకితీసాడు సారథి. కాగితంపైన అంకెలు లేవు. అక్షరాలున్నాయి. ఒకే ఒక్క వాక్యం. దానిక్రింద సంతకం.

"నాకు కావలసింది మీరు- ఇట్లు నీరజ."

సారథి ఒకటి రెండుసార్లుగా ఆవాక్యాన్ని చదువుకున్నాడు. నీరజవైపు చూచాడు. మళ్ళీ కాగితంవైపు! మళ్ళీ నీరజవైపు!! సారధికి అనిమిషత్వం సిద్ధించింది.

"నీరజ! మీరేనా?'" అప్రయత్నంగా అతడు ప్రశ్నించాడు.

'అవునండీ సారథిగారూ! నేనే మీ నీరజను' – అన్నట్టుగా నీరజ కళ్ళల్లో ఆనంద బాష్పాలు మిలమిల లాడుతున్నాయి!

(ఆంధ్రసచిత్ర వార పత్రిక 9-11-1960)

❀ ❀ ❀